క్లుప్తంగా

పారిశుధ్య కార్మికుల దీక్షలు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెంలో సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం పారిశుధ్య కార్మికులు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పసల సూర్యారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి షేక్ సుభాషిణి దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనీస వేతనాలు అమలు చేయాలని, స్థానిక సమస్యలు పరిష్కరించాలని, మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ రిలే దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి ఆచూకీపై పోలీస్ స్టేషన్‌లో తనిఖీ

జంగారెడ్డిగూడెం : ఒక వ్యక్తి కనిపించడం లేదని, అతను జంగారెడ్డిగూడెం పోలీసుల నిర్బంధంలో ఉన్నాడని, అతని భార్య హైకోర్టులో హెబియస్ కార్పస్ రిట్ పిటీషన్ వేయడంతో గురువారం రాత్రి హైకోర్టు నియమించిన అడ్వకేట్ కమిషనర్ స్థానిక పోలీసు స్టేషన్‌కు తనిఖీకి వచ్చారు. దీనికి సంబంధించి పిటీషనర్ శ్రీపాద శ్రీదేవి తరుపున హైకోర్టు హెబియస్ కార్పస్ రిట్ పిటీషన్ వేసిన న్యాయవాది పిల్లి సందీప్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 11న పిటీషనర్ శ్రీపాద శ్రీదేవి భర్త శ్రీపాద శ్రీనివాసాచారిని పోలీసులు స్టేషన్‌కు పిలిపించారని తెలిపారు. శ్రీపాద శ్రీనివాసాచారి కుటుంబ, బంధువులు ఆర్థిక లావాదేవీలకు సంబంధించి స్పందనలో ఫిర్యాదు చేశారని, ఆ ఫిర్యాదు నేపథ్యంలో శ్రీనివాసాచారిని స్టేషన్‌కు పిలిపించారన్నారు. ఆ రోజు నుంచి శ్రీనివాసాచారి కనిపించడం లేదని, దీంతో హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటీషన్ వేసినట్లు తెలిపారు. హైకోర్టు దీనిపై అడ్వకేట్ కమిషనర్‌ను నియమించగా, ఆయన పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారన్నారు. శ్రీనివాసాచారి ఆచూకీ తెలియలేదని, ఆయన ఆచూకీ కోసం న్యాయపోరాటం చేస్తామని న్యాయవాది సందీప్ తెలిపారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల తనిఖీలు

జంగారెడ్డిగూడెం : పట్టణంలో పలు మందుల షాపులను, ఆసుపత్రుల్లో అటాచ్‌డ్ కౌంటర్‌లుగా ఉన్న మందుల షాపులను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల బృందం తనిఖీ చేసింది. స్థానికంగా ఉన్న రెండు మెడికల్ షాపులు, మూడు ప్రైవేట్ ఆసుపత్రుల్లోని మందుల షాపుల తనిఖీల్లో భాగంగా పలు లోపాలను గుర్తించినట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తెలిపారు. ఒక ఆసుపత్రిలో, మందుల షాపులో ఫార్మసిస్టు కూడా లేరని అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. జంగారెడ్డిగూడెం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జాహ్నవి, ఏలూరు ఇన్‌స్పెక్టర్ బాలు, తణుకు ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

వరుస చోరీలతో ఆందోళన

లింగపాలెం : లింగపాలెం మండలంలో గత మూడు రోజులుగా వరస దొంగతనాలు చోటు చేసుకోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజుల క్రితం కె.గోకవరం గ్రామంలో ఒక ఇంటిలో చోరీ జరిగింది. ఈ వివరాలు తెలియక ముందే బుధవారం అర్ధరాత్రి ములగలంపాడు గ్రామంలో ఒక ఇంటిలో, భోగోలు గ్రామంలో రెండు ఇళ్లలో దొంగతనాలు జరిగాయి. వీరి ఇళ్లల్లో నగదు, బంగారం, వస్తువులను ఎత్తుకుపోయినట్లు యజమానులు తెలిపారు. ఈ మేరకు చోరీకి గురైన బాధితులు ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో ఎస్సై పి చెన్నారావు తన సిబ్బందితో దర్యాప్తు చేపట్టారు.

వృద్ధురాలి అదృశ్యంపై ఫిర్యాదు

ద్వారకాతిరుమల: మండలంలోని గొల్లగూడెంకు చెందిన ఒక వృద్ధురాలు అదృశ్యంపై గురువారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. గ్రామానికి చెందిన బొంతు కమల ఈనెల 19 నుంచి కనబడటం లేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెదికినా ఫలితం దక్కలేదు. వృద్ధురాలి కుమారుడు బొంతు నరసింహరావు స్థానిక పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల: దొరసానిపాడులో గురువారం సాయంత్రం ఒక పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 4,400 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

దాడి హేయం

కుక్కునూరు: ఒంగోలులో గిరిజన యువకుడిపై దాడి చేసి, విచక్షణారహితంగా కొట్టి నోట్లో మూత్రం పోసినటువంటి వ్యక్తులను, వెంటనే అరెస్టు చేయాలని ఆదివాసి సేన రాష్ట్ర న్యాయ సలహాదారు ఊకె రవి డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని అమరవరం గ్రామంలో జరిగిన ఆదివాసీ సేన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

నేటినుంచి సమగ్ర ఓటరు సర్వే

చింతలపూడి : ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 తేదీ వరకు బూత్‌లెవెల్ అధికారులు ఇంటింటా ఓటరు జాబితా పరిశీలన చేపట్టనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ విజయరాజు తెలిపారు. గురువారం చింతలపూడి తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా సవరణపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటు నమోదుకు ఫారం-6, తొలగింపులకు ఫారం-7, మార్పులు, చేర్పుల కోసం ఫారం-8 వినియోగించాలన్నారు. తహసీల్దార్ కృష్ణజ్యోతి పాల్గొన్నారు.

పోలవరం రూరల్ : ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం శుక్రవారం నుంచి నెల రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.సుమతి తెలిపారు. సమగ్ర ఓటరు సర్వేపై అన్ని పార్టీల నాయకులతో గురువారం రెవెన్యూ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు.

అర్హులకు సంక్షేమ లబ్ధి అందించడమే లక్ష్యం

చింతలపూడి : అర్హులైన పేదలకు అన్యాయం జరక్కూడదన్న ఉన్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. చింతలపూడి నగర పంచాయతీ సచివాలయం-4 పరిధిలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంట్లో అందించడానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ ఎస్.రాంబాబు, పట్టణ సచివాలయాల కన్వీనర్ ఎస్.దుర్గారావు, సొసైటీ అధ్యక్షుడు ఎ.సుబ్బారావు, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, ప్రసాదరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే రాఘవాపురం శుభం ఫంక్షన్ హాలులో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎలీజా పలువురికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొంద్రు వజ్ర కిషోర్, ఎంపీపీ బి రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ గుత్తా కిషోర్, ఎంపీటీసీ ఉలవలపూడి సువార్తమ్మ, ఎంపీడీఓ మురళీకృష్ణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులంతా లబ్ధి పొందాలి

ద్వారకాతిరుమల: ఏ ఒక్క అర్హుడికి అన్యాయం జరగకూడదనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్షను ప్రవేశపెట్టారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని సూర్యచంద్రరావుపేటలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులకు కుల, ఆదాయం, రేషన్, కౌలు రైతు కార్డులను ఆయన అందజేశారు.


చింతలపూడి : లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందచేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా


కొయ్యలగూడెం : ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు


ద్వారకాతిరుమల : ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, సచివాలయాల మండల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, డీసీఎంఎస్ డైరెక్టర్ జేవీ కృష్ణారెడ్డి, బొండాడ వెంకన్నబాబు, ఇతర నాయకులు ,అధికారులు పాల్గొన్నారు.

పథకాలు పేరు వింటేనే..

కొయ్యలగూడెం : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరే కాదు ఆయన ప్రవేశపెట్టిన పథకాలు పేరు వింటున్నా ప్రతిపక్షాలు పక్క తడుపుకుంటున్నాయని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఎద్దేవా చేశారు. తహసీల్దార్ పాసం నాగమణి ఆధ్వర్యంలో గురువారం పరింపూడి సచివాలయం-2 పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ వలన ప్రభుత్వ పథకాలు పొందడానికి ప్రజలకు వేచి చూసే ధోరణి పోయిందని, అవినీతి అక్రమాలకు తావులేని విధంగా ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేసుకుంటూ పోతుందని బాలరాజు అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని అడ్డుకోవడం ఎవరివల్లా కాదన్నారు. అనంతరం 650కి పైగా ధ్రువీకరణ పత్రాలను ప్రజాప్రతినిధులతో కలిసి అందజేశారు. ఎంపీపీ గంజిమాల రామారావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, సర్పంచ్ ముప్పిడి విజయకుమారి, ఉప సర్పంచ్ సంకుకొండ, ఎంపీటీసీ గంటసాల సీనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

జంగారెడ్డిగూడెం : నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ప్రతి ఒక్కరికి సంక్షేమ లబ్ధి అందించడం జరిగిందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ లక్ష్మి మాట్లాడుతూ ఎవరైనా అర్హులు ఉండి సంక్షేమ పథకాలు అందకుండా ఉంటే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షులు పీపీఎస్ చంద్రరావు, చనమాల శ్రీనివాస్, మేడవరపు విద్యాసాగర్, మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్, తహసీల్దార్ స్లీవజోజి తదితరులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : మండలంలోని వెలగపాడు పంచాయతీ వీరభద్రవరంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 300 మందికి వివిధ రకాల ధ్రువీకర పత్రాలు, 30మందికి రేషన్ కార్డులు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీను రాజు, పార్టీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు, సహకార సంఘ ఛైర్మన్ వాసిరెడ్డి మధు, ఎంపీపీ దారబోయిన లక్ష్మి, సర్పంచ్ సైనారపు జలపాలు, అధికారులు పాల్గొన్నారు.

కామవరపుకోట : తడికలపూడి సచివాలయం-2లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్, సర్పంచ్ కొత్తపల్లి రజిని శ్రీనివాస్ పాల్గొన్నారు. ముందుగా సచివాలయ ఆవరణలో మొక్కల నాటారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

కొమ్ముగూడెంలో జగనన్న సురక్ష

బుట్టాయగూడెం : మండలంలోని లక్ష్మడుగూడెం సచివాలయ పరిధిలోని కొమ్ముగూడెంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మడకం రామలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, తహసీల్దార్ ఎస్. శారా శాంతి, ఈఓపీఆర్‌డీ ఎం. శ్రీహరిల చేతుల మీదుగా అర్హులైన వారికి ఉచితంగా సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అదేవిధంగా సచివాలయం సమీపంలో మొక్కలు నాటారు. అలాగే గ్రామంలోని ఇంటింటికీ కుళాయి పథకంలో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశారు.

సమస్యల పరిష్కార వేదిక సురక్ష

లింగపాలెం : సమస్యల పరిష్కార వేదికగా జగనన్న సురక్ష పనిచేస్తోందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. గురువారం ముడిచెర్లలో నిర్వహించిన జగనన్న సురక్షలో అర్హులకు ఆయన వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ రావి రమాదేవి, కొండయ్య, ఎంపీటీసీ యం హేమప్రభాకరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, వైస్ ఎంపీపీలు మట్టా సురేష్, కర్లపూడి ఝాన్సీ, మండల వైఎస్సార్ సీపీ ముఖ్యనేత మునునూరి వెంకటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, రావి కొండయ్య, ఏఎంసీ డైరెక్టర్ కుప్పాల రామకృష్ణ, మండల ప్రత్యేకాధికారి ఏవీఆర్ గంగాధరబాబు, అధికారులు పాల్గొన్నారు.


లింగపాలెం : లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా


జంగారెడ్డిగూడెం : లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం


కామవరపుకోట : తడికలపూడిలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం


టి.నరసాపురం : వీరభద్రవరంలో ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం


బుట్టాయగూడెం : కొమ్ముగూడెంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

గ్రామాల్లో వరద భయం

- నీటమునిగిన ఎద్దెలవాగు వంతెన
- ఉగ్రరూపం దాల్చిన పెదవాగు
- జలదిగ్బంధనంలో 22 గిరిజన గ్రామాలు
- వేలేరుపాడులో భయాందోళనలు
- బెంబేలెత్తుతున్న పరీవాహక జనం

వేలేరుపాడు : ఎడతెరిపి లేకుండా కుండపోతగా కురుస్తున్న భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. గురువారం భద్రాచలం వద్ద 43 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. నీటి మట్టం 48 అడుగులకు చేరితే అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయితే మరో 16 గ్రామాలను వరద చుట్టుముట్టనుంది. దీంతో పరీవాహక ప్రజలు వణికిపోతున్నారు. వేలేరుపాడు నుంచి కొయిదా వెళ్లేదారిలో ఎద్దెలవాగు వంతెన బుధవారం అర్ధరాత్రి నీటమునిగింది. దీంతో దిగువన ఉన్న 19 గిరిజన గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. దిగువ ప్రాంతంలోని కొయిదా, కట్కూరు, కాచారం, తాళ్ళగొంది, పూసుగొంది, చిట్టంరెడ్డిపాలెం, ఎడవల్లి, బుర్రెడ్డిగుడెం, టేకూరు, సిద్దారం, కుంకుడు కొయ్యలపాకలు, మరో ఏడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం పెదవాగు ప్రాజెక్ట్ రెండు గేట్లు ఎత్తివేయడంతో కమ్మరిగుడెం, ఒంటిబండ, రామవరం ఊటగుంపు గ్రామాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. ఎద్దెలవాగు వద్ద గోదావరి వరద ఉధృతిని గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఝాన్సీ పరిశీలించారు. స్థానిక అధికారులను అప్రమత్తం చేశారు.

వరద ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు : జేసీ

గోదావరి వరదను ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు జాయింట్ కలెకర్టర్ లావణ్యవేణి పేర్కొన్నారు. గురువారం వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయంలో వరదపై అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో రెవెన్యూ అధికారులు గ్రామాలు ఖాళీచేయించేందుకు అప్రమత్తంగా ఉండాలన్నారు. భద్రాచలం వద్ద 43 అడుగులకు చేరుకున్న వర్షాల దృష్ట్యా, రెండో, మూడో ప్రమాదహెచ్చరికలు జారీ చేసే అవకాశాలు ఉన్నాయని, దీని వల్ల ఎక్కువ గ్రామాలు వరద ప్రభావితం కానున్నాయని, అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను కూడా రంగంలో దించనున్నట్లు తెలిపారు. వేలేరుపాడు, కుక్కునూరు, జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి, టోల్ ఫ్రీ నంబర్‌లు ఇవ్వాలని ఆదేశించారు. వేలేరుపాడు మండలంలో మూడు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భూదేవిపేట కస్తూరీబాగాంధీ ఆశ్రమపాఠశాల, శివకాశీపురం ఆశ్రమపాఠశాల, కుక్కునూరు మండలం రాయికుంట పునరావాస కాలనీలను పునరావాసానికి వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. మంచినీరు, విద్యుత్ సౌకర్యానికి అంతరాయం కల్గకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో శానిటేషన్ పనులు వెంటనే చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ రాజీవ్‌ను సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అపూర్వభరత్, ఐటీడీఏ పీఓ సత్యనారాయణ, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఝాన్సీ, జిల్లా పంచాయతీ అధికారి విశ్వనాథ్, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ డీఈ రాధాకృష్ణ, తహసీల్దార్ చల్లన్నదొర, వేలేరుపాడు తహసీల్దార్ రమేష్, ఎంపీపీ వాళ్ళ లక్ష్మీదేవి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కేసగాని శ్రీనివాసగౌడ్, కామినేని వెంకటేశ్వర్లు, గుద్దేటి భాస్కర్‌పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

పోలవరం రూరల్ : వరద పెరుగుతున్న దృష్ట్యా మండల స్థాయి అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బి.సుమతి సూచించారు. పోలవరం రెవెన్యూ కార్యాలయంలో వరద పరిస్థితిపై సమీక్షించారు. నెక్లెస్‌బండ్ గట్టు పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని ఏజీఆర్‌బీ సిబ్బందికి సూచించారు. పోలవరం రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఏటిగట్టు వెంబడి సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


పోలవరం రూరల్ : ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల మధ్య లంక ఒడ్డులను తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

ఏజెన్సీలో వర్షాల జోరు

బుట్టాయగూడెం : ఏజెన్సీప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. స్థానిక అంబేడ్కర్ నగర్ కాలనీ సమీపంలోని శ్మశాన వాటిక పరిసర ప్రాంతంలో విద్యుత్ వైర్లు తెగి నేల మీద పడ్డాయి. ఆ సమయంలో అటువైపు వెళ్లిన మేకలు విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాయి. అదేవిధంగా తూర్పు పాలకుంట గ్రామంలో ఓ తాటాకిల్లు వర్షానికి కూలిపోయింది.


కుక్కునూరు : ముంపునకు గురైన గుండేటి వాగు వంతెన

గర్భిణులను ఆస్పత్రులకు తరలింపు

వేలేరుపాడు : గోదావరి వరద వల్ల బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయిన గ్రామాల్లో ఉన్న గర్భిణీ మహిళలను డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ రాజీవ్ ఆధ్వర్యంలో వైద్య సౌకర్యం అందుబాటులో ఉన్న జంగారెడ్డిగూడెం, విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రులకు గురువారం సాయంత్రం తరలించారు. వేలేరుపాడు మండంలోని ఎర్రతోగు, కొయిదా, బుర్రెడ్డిగూడెం గ్రామాలకు చెందిన మహిళలను ఎద్దెలవాగు వద్ద బోట్‌పై తరలించారు. వీరేకాకుండా బోళ్ళపల్లి, పడమటిమెట్ట, చిగురుమామిడి కాలనీలకు చెందిన మొత్తం ఆరుగురు గర్భిణులను జంగారెడ్డిగూడెం, విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రులకు ముందు జాగ్రత్తగా తరలించారు. ఈ కార్యక్రమంలో కొయిదా వైద్యాధికారి మాధురి, సిబ్బంది పాల్గొన్నారు.


గర్భిణులను ఆస్పత్రులకు తరలిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ రాజీవ్

'విర్డ్' సేవలు మరింత విస్తృతం చేస్తాం


విర్డ్ ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న శ్రీ వేంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ రిహాబిలిటేషన్ ఫర్ ద డిజేబుల్డ్ (విర్డ్) ఆస్పత్రి సేవలను మరింత విస్తృత పరుస్తున్నట్టు ఆస్పత్రి ట్రస్టు ఛైర్మన్ ఎస్వీ సుధాకరరావు చెప్పారు. ఆస్పత్రి మొదటి అంతస్తులో అవంతి ఫీడ్స్ కంపెనీ అధినేత ఎ.ఇంద్రకుమార్ విరాళం రూ.2 కోట్లతో నూతనంగా నిర్మించిన ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, అలాగే దేవీ సీఫుడ్స్ ఎండీ పి.బ్రహ్మానందం విరాళం రూ.50 లక్షలతో నిర్మించిన జనరల్ వార్డును, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ నిధులు రూ.10 లక్షలతో సమకూర్చిన పేషెంట్ లిఫ్ట్‌ను గురువారం ప్రారంభించారు. వీటిని ఆస్పత్రి ట్రస్ట్ ఛైర్మన్ సుధాకరరావు, సిఫి సాఫ్ట్‌వేర్ కంపెనీ ఛైర్మన్ వేగేశ్న అనంతకోటి రాజుల పర్యవేక్షణలో పద్మశ్రీ అవార్డు గ్రహీత, సిఫి కంపెనీ డైరెక్టర్ టి.హనుమంత్ చౌదరి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం పలువురు దివ్యాంగులకు నామమాత్రపు రుసుముతో కృత్రిమ అవయవాలను వారు అందించారు. అనంతకోటి రాజు ఆధ్వర్యంలో సిఫి కంపెనీ పాలకవర్గ సమావేశంలో సుధాకరరావు మాట్లాడుతూ విర్డ్ ఆస్పత్రిలో సేవే లక్ష్యంగా నామమాత్రపు రుసుముతో రోగులకు అత్యాధునిక వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. ఆస్పత్రి ట్రస్ట్ సభ్యులు వి.నారాయణమూర్తి, ఐవీఆర్ సుధాకరరావు, ఎం.గుప్త, చెలికాని రాజబాబు, ఆర్.విశ్వనాథరాజు, వైద్యులు డాక్టర్ భాస్కరానంద కుమార్, భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, పి.కృష్ణమోహన్, శ్రీవారి దేవస్థానం అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు పాల్గొన్నారు.

గడపగడపకుతో గ్రామాల్లో అభివృద్ధి

కొయ్యలగూడెం : గడపగడపకు నిర్వహణ కార్యక్రమంతో పట్టణాలు మొదలుకొని పల్లెల వరకు పురోభివృద్ధిలో పయనిస్తున్నాయని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. కొయ్యలగూడెం కమ్యూనిస్టు నగర్‌లో గురువారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమస్యల పరిష్కారమే ముఖ్య ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా దీర్ఘకాలంగా ఉన్న స్థానిక సమస్యలు పరిష్కారానికి అవకాశం లభించిందని అన్నారు. ఈ సందర్భంగా తమ ప్రాంతంలో విద్యుత్ సమస్యల గురించి ఎమ్మెల్యే వద్ద స్థానికులు ఏకరువు పెట్టారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ 15 రోజులలోగా నూతన విద్యుత్ స్థంభాలను ఏర్పాటు చేసి విద్యుత్‌ను క్రమబద్ధీకరించడంతోపాటు సమస్యలను పరిష్కరించాలని సంబంధితశాఖ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పరింపూడి పంచాయతీలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, అధిక వర్షాల నేపథ్యంలో డ్రెయినేజీ నీరు సీసీ రోడ్లపై ప్రవహిస్తూ దుర్గంధం కలగచేస్తుందని చెప్పారు. పోలవరం రోడ్డులో గణేష్ సెంటర్ నుంచి మొదలుకొని మహాలక్ష్మి థియేటర్ వరకు పక్కా డ్రెయినేజీ నిర్మాణానికి ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు సమకూర్చిన రూ.10 లక్షల నిధులతోపాటు అదనంగా నాలుగు సచివాలయాల నుంచి రూ.5 లక్షల చొప్పున రూ.20 లక్షల గ్రాంటును కలిపి మొత్తం రూ.30 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు మంతెన సోమరాజు, వైస్ ఎంపీపీ మట్టా వనజాలక్ష్మి, ఎంపీటీసీలు గంట శ్రీనివాస్, చింత శ్రీదేవి, మాజీ ఎంపీపీ మట్ట సత్తిపండు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, నిక్కర్ నాగేశ్వరరావు, మారిశెట్టి శ్రీను, చిటికెన నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.


కమ్యూనిస్టు నగర్‌లో గడపగడపకు కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

లింగపాలెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. లింగపాలెం మండలం ముడిచెర్ల గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని గురువారం ఎమ్మెల్యే ఎలీజా ప్రారంభోత్సవం చేశారు. గ్రామ సర్పంచ్ రావి రమాదేవి కొండయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత మునునూరి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు మట్టా సురేష్, కె.ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు

చింతలపూడి : చింతలపూడి సుప్రింపేట సచివాలయం - 4 పరిధిలో రెండు సీసీ రహదారులకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో సచివాలయ పరిధిలోని గ్రామస్తులు రహదారుల దుస్థితిపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో గురువారం సాయంత్రం సుప్రింపేట వైఎస్సార్ కాలనీని పరిశీలించిన ఆయన సీసీ రహదారులకు నిధులు మంజూరు చేస్తూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

ల్యాండ్ సీలింగ్, ఎల్‌టీఆర్ భూములకు పట్టాలివ్వాలి

జంగారెడ్డిగూడెం : ల్యాండ్ సీలింగ్ భూములు, గిరిజనులు సాగు చేస్తున్న ఎల్‌టీఆర్ భూములకు పట్టాలు ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జంగారెడ్డిగూడెం మండల కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పేదలకు భూ పంపిణీ చేయాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సంఘ మండల కార్యదర్శి ఎ.ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.